క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: ఉండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్ డీఎస్ఎస్ పనుల్లో భాగంగా కొత్త బ్రేకర్ ఏర్పాటు నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా ఆరేడు 11 కేవీ ఫీడర్ పరిధిలోని బీసీ కాలనీ, ఎస్ఆర్‌పీ అగ్రహారం, భీమవరం ఉండిరోడ్డు ఏరియాల్లో, ఉప్పుగుంట ఫీడర్ పరిధిలోని ఆక్వా, చేపల చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

పలు గ్రామాలకు విద్యుత్ కోతలు

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శ్రీరామపురం 11 కేవీ ఫీడర్‌పై ఆర్‌డీఎస్ఎస్ పనులు, లైన్లు మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెకంటేశ్వరరావు సోమవారం తెలిపారు. వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం



సిబ్బందితో మాట్లాడుతున్న ఆఫీసర్ డాక్టర్ నాగలక్ష్మి

వీరవాసరం: జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేడుతున్నట్లు రాష్ట నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి నాగలక్ష్మి చెప్పారు. దీనిలో భాగంగా వీరవాసరం హైస్కూలు, రాయకుదురు బాలికల జూనియర్ కాలేజీ, వీరవాసరంలో రెండు అంగన్‌వాడీ సెంటర్లు, ఒక ప్రైమరీ స్కూలును సందర్శించారు. మాత్రలు అందాయా లేదా వంటి వివరాలను తనిఖీ చేశారు. నులిపురుగు నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీరవాసరం పీహెచ్‌సీ వైద్యాధికారి, జిల్లా ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం రాజేష్,, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఎంఎల్‌పీ హెచ్‌లు, ఏఎన్ఎం, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నేడు నాయీబ్రాహ్మణ జేఏసీ సమావేశం

ఉండి: నాయీబ్రాహ్మణ జిల్లా జేఏసీ సమావేశం మంగళవారం ఉదయం 9 గంటలకు గణపవరంలోని కన్యకాపరమేశ్వరీ వర్తక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ పట్నాల గణపతి, సేవాసంఘ కార్యదర్శి మలువలస వీరవెంకటసత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నాయీబ్రాహ్మణుల ఐకమత్యాన్ని చాటించేందుకు జిల్లా నలుమూలల నుంచి ఈ సమావేశానికి విచ్చేయాలని వారు కోరారు.

'ఆల్బెండజోల్'తో రక్తహీనత నివారణ



ఆల్బెండజోల్ మాత్రలపై పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ నవ్య జీవన్

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల రక్తహీనత నుంచి బయటపడవచ్చని డాక్టర్ ఎం నవ్యజీవన్ అన్నారు. సోమవారం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నులి పురుగులు నివారణపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నవ్యజీవన్ మాట్లాడారు. ఈ నెల 12న హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ నులిపురుగులు నివారణ కార్యక్రమంలో భాగంగా అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. 22వ తేదీన కూడా మాత్రలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎలిజబెత్, ఎస్‌కే అమలేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి అభిషేకం

యలమంచిలి: శ్రావణ శుద్ధ విదియ సందర్భంగా స్థానిక ఉమా సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివలింగానికి పంచామృతాభిషేకం చేశారు. అర్చకులు యలమంచిలి నరేంద్రశర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి కుంకుమపూజ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు దేవేరులను దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాద వితరణ చేశారు.

జూదరుల అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: మండలంలో అరట్లకట్ట గ్రామంలో పేకాట శిబిరంపై నిర్వహించిన దాడుల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.21,200 స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్సై బి సురేంద్ర కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

సర్కారీ వైద్యం.. సమస్యలమయం

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా వైద్యుల పోస్టులు
- వైద్యం అందక, వసతులు లేక అవస్థలు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు లేక, వసతులు అందక రోగులకు కన్నీళ్లు తప్పడం లేదు. దిక్కులేని పరిస్థితుల్లో కొందరు ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరతతోపాటు సరైన వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భీమవరం పట్టణంతోపాటు, భీమవరం మండలం, వీరవాసరం, అలాగే ఉండి నియోజకవర్గం, కృష్ణాజిల్లా తీర ప్రాంత ప్రజల కూడా ఈ ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతారు. రోజుకు 300 నుంచి 400 మందికి ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తుండగా, నెలకి 20 నుంచి 30 డెలివరీ, జ్వరాలు, ఇతర కేసులకు సంబంధించి ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. అలాంటి ఆస్పత్రిలో సౌకర్యాలు కొరత, పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏరియా ఆస్పత్రిలో మొత్తం 23 మంది వైద్యులకుగాను 18 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. అలాగే ఎక్స్‌రే, ఈసీజీ తీయడానికి ఇద్దరు టెక్నీషియన్లకు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. దీంతో ఎక్స్‌రే, ఈసీజీ తీయించుకునేందుకు వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఆస్పత్రిలో బాలింతలు, ఇతర రోగులు ఉండే వార్డుల్లో అందుబాటులో మంచినీటి సౌకర్యం లేదు. వార్డుల్లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. నీళ్లు సక్రమంగా రాక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. బెడ్‌షీట్‌లు సైతం ఇవ్వకపోవడంతో బాలింతలు, రోగులు ఇంటి వద్ద నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి. బెడ్ పక్కన చంటి బిడ్డకు ఊయల ఏర్పాటు చేయడం లేదు. అలాగే పోస్టుమార్టం చేసే భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ నుంచి నీళ్లు లీకేజీ కావడం, భవనంపై మొక్కలతో అధ్వానంగా ఉంది.

అందుబాటులో ఉండని వైద్య సిబ్బంది

భీమవరం అర్బన్: ప్రభుత్వ ఆసుపత్రి వైద్యం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అందని ద్రాక్షగా మారింది. వైద్య సిబ్బంది అందుబాటులో లేక అత్యవసర సమయాల్లో వైద్యం నిమిత్తం భీమవరంలోని ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో కొప్పర్తి వీరాస్వామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సాక్షి విజిట్ చేయగా మెడికల్ ఆఫీసర్, ఫార్మసీ, ల్యాబ్ టెక్నీషియన్, వైద్య సిబ్బంది ప్రైవేట్ పంక్షన్‌కు వెళ్లడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక ఉద్యోగి మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడింగ్ చేస్తున్నారు. మిగితా వారు లేకపోవడంతో కనీసం సమాధానం చెప్పే వారు లేకపోవడంతో రోగులు తీవ్ర అసహనానికి గురయ్యారు. పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. బీఎస్సీ నర్సింగ్ ఉద్యోగులను పెట్టి వైద్య సేవలు అందిస్తున్నారు. రాత్రిళ్లు వాచ్‌మెన్ లేకపోడంతో విధులు నిర్వహించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్య సిబ్బంది చెబుతున్నారు. పీహెచ్‌సీ పరిధిలో 11 గ్రామ పంచాయతీలు ఉండగా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది సకాలంలో ఉండటం లేదని, దీంతో భీమవరం పట్టణానికి వెళ్లాల్సి వస్తుందని రోగులు చెబుతున్నారు.

మరమ్మతులు లేకుండానే భవనాలకు రంగులు

కాళ్ల మండలంలోని పురాతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు లేకుండానే భవనానికి రంగులు అద్దేశారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం, పనులు జరగకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఆకివీడు సీహెచ్‌సీ పాత భవనంకు కూడా మరమ్మతులు చేపట్టకుండా రంగులు వేసేశారు.

సుగర్ వ్యాధిగ్రస్తుల బాధ వర్ణనాతీతం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుగర్ మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు బిళ్లలకు గాను ఒక్కటే ఇస్తుండడంతో సుగర్ వ్యాధిగ్రస్తులు ప్రైవేటు మందుల షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇన్సులిన్ సైతం ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా రావడంలేదని సుగర్ వ్యాధిగ్రస్తులు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే సుగర్ మందులు, ఇన్సులిన్‌ను అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులకు సరఫరా చేయాలని కోరుతున్నారు.



భీమవరం ప్రభుత్వాసుపత్రిలో టాయిలెట్స్, మంచినీటి సమస్య ఎదుర్కొంటున్న బాలింతలు



శిథిలావస్థలో పోస్టుమార్టం భవనం



గొల్లవానితిప్పలో ఖాళీగా ఉన్న పీహెచ్‌సీ



రోగులు లేక ఖాళీగా ఉన్న జనరల్ వార్డు

పల్లె ప్రజలకు అందని వైద్యం

ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు: నియోజకవర్గంలోని ఆకివీడు, ఉండి, కాళ్ళ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యుల కొరతతో రొగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులకుగాను ఒక్కరే ఉంటున్నారు. మరొక పోస్టు ఖాళీగా ఉంది. పాలకోడేరు మండలంలో ఇద్దరు వైద్యులకు ఒక్కరే హాజరుకావడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మరొక వైద్యులు గులాబ్ రాజ్‌కుమార్ గైర్హాజరయ్యారు. 24 గంటలూ పనిచేసే ఆసుపత్రిలో నైట్ వాచ్‌మెన్‌లేక తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. సిబ్బంది రాత్రిపూట భయపడుతూ విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఆకివీడు సీహెచ్‌సీలో సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. డిప్యూటేషన్‌పై ప్రశాంత్ వెళ్లిపోయారు. కానీ జీతం స్థానికంగానే తీసుకుంటున్నారు. మరో రెండు పోస్టులు గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు పనిచేస్తున్నారు.



ఆకివీడు సీహెచ్‌సీలో మరమ్మతులు చేయకుండానే రంగులు వేసిన దృశ్యం



ఆకివీడు సీహెచ్‌సీలో సీజనల్ జ్వరాలతో రోగులు

పీజీఆర్ఎస్‌కు 2 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం చెప్పారు. కోళ్లపర్రు గ్రామంలో అనుమతులు లేకుండా ఉన్న పాత భవనంపై రెండవ అంతస్తు భవనం నిర్మిస్తూ, పైప్‌లైన్ ఉన్న ప్రాంతంలో ప్రహారీ నిర్మాణం చేపట్టారని, చర్యలు తీసుకోవాలని పన్నాసి సత్య శ్రీ కృష్ణ ఫిర్యాదు చేశారు. అయిభీమవరం గ్రామంలో సర్వే నెంబర్ 89లో కొందరు ఇళ్లను నిర్మించుకుని పంట బోదెలో చెత్తచెదారం వేసి, పూడ్చివేస్తున్నారని, దీంతో సమీపాన ఉన్న పొలాలకు సాగునీటి ఇబ్బంది ఏర్పడుతోందని రైతు కనుమూరు విజయ రామరాజు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రత్యేక తరగతులు

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన విద్యను అందించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. సోమవారం భీమవరం పట్టణం దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వసుధ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన విద్యా సౌజన్యం లెర్నింగ్ సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ముగిసిన అనంతరం ఒక గంట పాటు ప్రత్యేక టీచర్ల ద్వారా పాఠాలను చదివించడం, హోమ్ వర్క్ చేయించడం, కొత్త విషయాలను నేర్పించడం అదనపు తరగతుల ప్రత్యేకత అన్నారు. రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. వసుధ ఫౌండేషన్ అందించిన నోటు పుస్తకాలను విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో డీఈవో ఇ నారాయణ, సమగ్ర విద్య ఏపీసి పి శ్యాంసుందర్, పాఠశాల హెచ్ఎం ఆర్ రాంభద్రరావు, ఏఎంఓ సీహెచ్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, మానవత ప్రతినిధి వెంకటపతిరాజు పాల్గొన్నారు.



దుర్గాపురం మునిసిపల్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

పాలకోడేరు: మండలంలోని నాలుగు వ్యవసాయ సహకార సంఘాల(సొసైటీ)కు ఎట్టకేలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు సొసైటీల చైర్‌పర్సన్ పదవుల్లో ఒకటి బీజేపీకి మరో మూడు టీడీపీకి కేటాయించారు. శృంగవృక్షం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా కలిదిండి కృష్ణంరాజు, సభ్యులుగా కడలి రంగారావు, వీరవల్లి శ్రీనివాసకుమార్, పాలకోడేరు సొసైటీ చైర్‌పర్సన్‌గా కొత్తపల్లి నాగరాజు, సభ్యులుగా యర్రా అప్పారావు, పాలా నాగ గంగాధరరావు, కుముదవల్లి చైర్‌పర్సన్‌గా బుద్ధరాజు బలరామకృష్ణంరాజు, సభ్యులుగా పి. సూర్యారావు, భూపతిరాజు మధుమోహన రాజు, విస్సాకోడేరు సొసైటీ చైర్‌పర్సన్‌గా నంబూరి వెంకట రామాంజనేయవర్మ, సభ్యులుగా సంగారెడ్డి విజయలక్ష్మి, బైరెడ్డి శ్రీనులను నియమించారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

భీమవరం: నేటి ఆధునిక సమాజంలో విద్యార్థుల ఎదుగుదలకు వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమైనదని, స్నేహభావం, మంచి వాక్చాతుర్యం పెంపొందించుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఆకుల వెంకటశేష సాయి అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకట శేష సాయి మాట్లాడుతూ విద్యా రంగాన్ని ర్యాగింగ్, మాదక ద్రవ్యాలు తీవ్రంగా బాధిస్తున్నాయని, వాటి నుంచి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ గాదిరాజు సత్య నారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ తమ కళాశాలకు జాతీయస్థాయి అక్రిడేషన్ ఉండడంతో నాణ్యమైన విద్యను అందించడానికి యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం రిటైర్డ్ న్యాయమూర్తి వెంకటశేషసాయిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి వెంకటశేషసాయిని సత్కరిస్తున్న దృశ్యం

గోతులమయంగా రాష్ట్రీయ రహదారి



వినాయకుని గుడి వద్ద గోతుల్లో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



సచివాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు

కాళ్ల: జువ్వలపాలెం రాష్ట్రీయ రహదారి గోతులమయంగా మారింది. చిన్నపాటి వర్షాలకే తాత్కాలిక మరమ్మతులు కొట్టుకుపోయి అధ్వానంగా తయారైంది. ప్రధానంగా పెదఅమీరం నుంచి కోపల్లె, జక్కరం, సీసలి, కాళ్ళకూరు, గ్రామాల పరిధిలో రాష్ట్రీయ రహదారి గోతులమయంగా మారింది. జక్కరం గ్రామంలో వినాయకుడి ఆలయం వద్ద, సచివాలయం వద్ద గోతులు ఏర్పడి వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి వర్షపు నీరు నిలిచిపోవడంతో గోతులు కనబడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యూరియాను అందించలేని ప్రభుత్వమిది

ఆకివీడు: కూటమి ప్రభుత్వం ఏడాదిగా రైతులకు ఏవిధమైన సౌకర్యాలు కల్పించలేదని, వ్యవసాయం దండగ అన్నట్లుగానే పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సరిపడే యూరియా ఎరువుల్ని కూడా అందుబాటులోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు. సొసైటీలకు మొక్కుబడిగా యూరియాను సరఫరా చేసి, మైళ్ల దూరం వెళ్లి రైతుల్ని తెచ్చుకోమనడం దారుణమన్నారు. సొసైటీలకు సరఫరా చేసిన యూరియా బడా రైతులు, కూటమి రైతులకే వెళ్లుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. కొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయన్నారు. బ్లాక్ మార్కెట్ లేకుండా ఆర్‌ఎస్కేల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేయాలని సీతారామయ్య డిమాండ్ చేశారు. జగనన్న పథకాల పేర్లు మార్చి మొక్కుబడిగా అమలుజేస్తున్న కూటమి ప్రభుత్వం కొత్త పథకం ఒక్కటీ అమలుజేయలేదని ఆరోపించారు. అన్నదాతల పట్ల రాజకీయం తగదని సీతారామయ్య హెచ్చరించారు.



నంద్యాల సీతారామయ్య, పార్టీ మండల అధ్యక్షుడు

అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపాలి

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 31 అర్జీలు అందాయని ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఎలాంటి జాప్యంలేకుండా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్షీరారామంలో సప్త ప్రదక్షిణ



సప్త ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సప్తప్రదక్షిణల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోషకాలంలో ప్రదక్షిణలు మొదలుపెట్టారు. సుమారు మూడు వేల మంది భక్తులు ప్రదక్షిణల్లో పాల్గొన్న అనంతరం స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారికి పంచహారతులు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస రావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో మోహన్‌యాదవ్

పెనుగొండ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని ఆ పార్టీ అనుబంధ విభాగాల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుసు మోహన యాదవ్ తెలిపారు సోమావారం ఆయన తాడేపల్లిగూడెంలో ఆచంట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును కలిసి పార్టీ పటిష్ఠతపై చర్చించారు. హామీలు అమలు చేయకపోవడంతో కూటమి పాలనపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. మూడు నెలలు కాలంలో కూటమి ప్రభుత్వం రూ.37 వేల కోట్లు అప్పు చేసిందని తెలిపారు. దేశంలో అప్పులు చేయడంలో కూటమి ప్రభుత్వం నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. సంక్షేమంలో వెనుకంజ వేసిందని వివరించారు. ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని, పోరుబాట పట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లాలోని అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.